కథానిక

# శూన్యంలోని దృశ్యాలు

ఎండమావుల్ని స్ఫురింపచేస్తూ నీలాకాశంలో సామ్రాజ్యాలు కనిపిస్తున్నాయి. కిటికీలోంచి చల్లగాలి వీస్తోంది. రవణ పడక్కుర్చీలో కూర్చుని చదువుతున్న 'ప్రామిథియస్ అన్ బౌండ్'ని పక్కకు విసిరేశాడు. బుక్ షెల్ఫ్ వైపు చూశాడు. ఎన్నో పుస్తకాలు. అర్థంకానివి. ఏనాడూ రహస్యాన్ని దాచుకునేవి. చీకటి సమస్యల్ని జీవిత సాగరాన్ని మథించిన కవుల వ్యూహా ప్రపంచాల్తో నిండిన ఆ పుస్తకాలు...అవే తనకి సమస్తమూ. సహాయంకోసం ప్రపంచంవైపు ఆశగా చేతులు చాచిన షెల్లీ కవిత్వం. ఆకాశయానంచేసే బ్రౌనింగ్ ఫిలాసఫీ. బైరన్ వితండవాదన-అన్నీ తనని వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయ్. తనదంతా వ్యూహా సౌఖ్యం. గడియారం పియానోలా మ్రోగుతూ ఆరు కొట్టింది.

జీవితపు వెలుగుల్ని విరజిమ్ముతూ జంటలు— నవ్వుతూ — తులుకుతూ — పార్కులోంచి వచ్చేస్తున్నారు. అతనికా దృశ్యం గుండెల్ని చీలుస్తున్నట్టనిపించింది. స్పెన్సర్ జ్ఞప్తికొచ్చాడు. అతను కూడా షెల్ఫులోంచి తన్ను చూసి నవ్వుతున్నాడు ఆవేళ పోస్టులో వచ్చిన వీక్లీ తిరగేశాడు. పుస్తకాన్ని బల్లమీదకి విసిరికొట్టాడు. ఒమర్ ఖయ్యాం ఫక్కుమన్నాడు...ఎక్కడ చూసినా ఆనందం-రమ్మంటోంది-తనకీ దానికీ మధ్యవున్న ఇనుప కటకటాల నీడ నిడివి పొడుగవుతోంది.

నెమ్మదిగా ఎవరో తలుపు తడుతూ 'రవణారావుగారూ!" అని పరిచేలమీదిగా గాలిలా పిలిచారు.

తలుపు తెరుస్తూంటే రెక్కలు గిర్రుమన్నాయి.

"మీరా!...రండి...ఏం ఇలా వచ్చారు?" షెల్ఫుమీదున్న వీనస్ బ్రాంజ్ విగ్రహాన్ని చూస్తూ అన్నాడు:

"మీ ఆలోచనను పాడుచేశానుగామోలు — డీప్ థాట్ లో వున్నారు."

"అబ్బే!...లేదండి. ఇంతకీ మీ అమ్మాయి చదువు మానేసినట్టేనా?" రవణ అనవసరంగా అడిగా ననుకున్నాడు.

"అవునండీ! ... ఇప్పటికే ఇంట్లో పోరుపడలేకున్నాను...మనకు ఆశయాలున్నా అమలుపర్చటం సాధ్యంకావద్దూ? ... వచ్చిన సంగతి వదిలేస్తున్నా. ఇదిగో శుభలేఖ. ఎల్లుండి మా అమ్మాయి పెళ్ళి. మీరు తప్పకుండా రావాలి. అమ్మాయి మరీమరీ చెప్పమంది."

పక్కింటి మేడమీద గడియారం ఆరుకొట్టింది. రెండు గడియారాలకీ ఎంత వ్యత్యాసం!...జీవితాలు కూడా ఇలాగే గడుస్తున్నాయి.

"అలాగేనండి" అన్నాడు. నిశ్శబ్దం యెల్లెడలా ఆవరించింది. పక్కింట్లో తల్లి, పిల్లల పసిడి పలుకులు విని ముసిరిపోతోంది. అది చూడలేక కిటికీ తలుపు మూశాడు. పాపం-కమలకు తనను గురించి ఎలాంటి అభిప్రాయముందో కాని తండ్రిని పంపింది. తనుమాత్రం క్లాసులో ఆమె అందాన్ని తాగేవాడిలా చూసేవాడు. అందుకు తరువాత సిగ్గుపడేవాడు. కమలను పెళ్ళి చేసుకోవాలని కూడా చాలాసార్లనుకున్నాడు. ముసిలితనం తన మీద కురుకుతోంది...వీపు చరచుకుని ప్లేటో దగ్గరికి పరుగెత్తాడు.

కవరు తనకోసం ఎదురుచూస్తోంది. చించి చూశాడు. మావయ్య ఉత్తరం. అందులో ముఖ్య విషయాలు:

"...నువ్వు మమ్మల్ని బొత్తిగా మర్చిపోతున్నావు. మళ్ళీ పెళ్ళి చేసుకోమంటే విన్నావు కాదు. పండంటి నీ జీవితానికి నిప్పెట్టుకున్నావు. ఉత్తరాలకు జవాబు లివ్వవు...మీ అన్న కొడుకు కాలేజీలో చదువుతున్నాడు కదూ! ... నువ్వు పిచ్చాడివై పోతున్నా వన్నాడు. అన్నట్టు నువ్వు కొంతమంది కుర్రాళ్ళతో హంపీ వెడదామనుకుంటున్నావట కదూ?...నే నక్కడికి వస్తున్నా.

ఆర్. యం. చిదంబరం

అంతవరకు ఆగాలి నువ్వు...నీతో ఎన్నో ముఖ్య విషయాలు మాట్లాడాలి..." ఇంకా ఏదో సోది రాస్తున్నాడు. నిజానికి ఇలియట్-స్విన్ బర్న్-అందరూకలిసి తన్ను పిచ్చివాణ్ణి చేశారు. పర్సు బరువుగావుంది. ఆవేళే అందుకున్న జీతం, ఎందుకు? ఆనాడక్కరకుదానిది! ఎముకల్లో జీర్ణించుకున్న తన సిద్ధాంతాలెవరికి నచ్చుతాయ్? అందరూ నవ్వుతారంతే.

*　　*　　*

నిజం. కమల తనకాధారమురాలే అయింది. ఆమె బుగ్గలు సొట్టలుపడేట్టు నవ్వుతుంటేచూస్తూ అలాగే నిలబడిపోయేవాడు. తనవెంట బంగారు వెలుగును తీసుకొచ్చింది. తన గదిలో అడ్డంకు ల్లేకుండా విహారంచేసిన చీకటి ఎక్కడికో పోయి దాక్కుంది. షెల్లీ కవి పెదవులమీద నిద్రించాలన్నాడుకాని తన వూహాలన్నీ ఆమె పెదవుల మీదే నిద్రించాయి. ఇదంతా తాత్కాలికమన్న సంగతి తనకు తెలుసు. జీర్ణించుకు పోయిన వేదాంతం అనురాగాన్ని వర్షించలేదు. కలలన్నీ అలాగే వుండిపోయాయి. తృప్తి అనేది అందుబాటులో కనిపించి మాయమయ్యేది.

కమలకు గుండెదడ వుందని తనకు తెలియదు. క్రమంగా ఆమె ఆరోగ్యం ఇరుకుదారిలా సన్నగిలింది. చీపురుపుల్లలా తయారైంది. రవణ పరిస్థితుల ఒత్తిడివల్ల మొదట్లో నిర్లక్ష్యంచేసినా తరువాత డాక్టరుకు చూపించాడు. మూడోనాలుగో ఇన్‌జెక్షనులిచ్చాడు. కాని ఫలితం కనిపించలేదు. హృద్రోగమని డాక్టరు చూచాయగా అన్నాడు. చివరకు పెద్దడాక్టరు క్షయ అన్నాడు. ముందు రవణకు టి. బి. పట్టుకున్నట్లయింది. ప్రపంచమంతా గిర్రున తిరిగింది. బుగ్గలమీదున్న గుంటల్లో చీకట్లు ఆవరించాయి. కమల తండ్రి కూతురుకు సరైన ట్రీట్‌మెంట్ చేయించలేక ఆలస్యం చేశాడని ఎగిరిపడ్డాడు. అంత బాధలోనూ రవణకు నవ్వొచ్చింది. ట్రీట్‌మెంట్ చేయిస్తానని కమలను తీసుకుపోయాడు.

మళ్ళీ కమల తిరిగి రాలేదు. ప్రయివేటుగా బి.ఏ.కు చదువుదామని కొన్న పుస్తకాలు దూరంగాపోయాయి. చుట్టూ పొగలాంటి నిరాశ అలుముకుంది. చాలాసార్లు కమల ఇంటికి వెళ్ళి వచ్చాడు. కమల ఏమీ తేరుకోలేదు. డాక్టరు మాత్రం అభయహస్తం చూపించాడు. ఎక్స్‌రే ఫొటోలా తయారవుతోంది.... ఆఖరి క్షణాన వుద్యోగం వదిలేద్దామనుకున్నాడు.

ఆరునెలలు గడిచాక కమల జబ్బు తీవ్రరూపం దాల్చింది. రవణను 'వెంటనే రమ్మని టెలిగ్రాం వచ్చింది. తొందరగా సామానుసర్దాడు. ఎక్కడో ఏమూలో...అపస్వరాలు వినిపిస్తున్నాయి. కమల అంతరించి అణువుల్లో కలిసిపోతుందని తనకు ముందే తెలుసు. రైలు నల్లటి పొగను వదులుతూ చీకటిని చీల్చుకుపోతుంటే గుండెలు హోరుమన్నాయి.

ఇంటికొచ్చేసరికి చీకటిపడుతోంది. రిక్షాలోంచి దిగంగానే వాక్కు వురుకున లోపలకెళ్ళాడు. కమల అంతిమఘడియల్లో వుంది. కళ్లు తెరచిచూసి, 'వచ్చారూ!' అంది. మావగారు వెర్రిగా రవణను కౌగలించుకునేడ్చారు. చంద్రుడు మబ్బుల ముసుగేసుకున్నాడు. నక్షత్రాలు మానవుల జీవితాల్ని చూసి వణుకుతున్నాయి.

అయిపోయింది, అంతా అయిపోయింది.

మతిలేనివాడిలా పార్కులో కూర్చున్నాడు. హృదయం దుఃఖాన్ని భరించలేక పగులుతానంటోంది. కళ్ళల్లో నీరింకిపోయింది. తనకెదురుగా దంపతులు ఆనందిస్తున్నారు. ప్లేటస్ భగవంతుడికి ప్రియులయినవారు ముందే చనిపోతారన్నాడు. ఛీ! ఈ వేదాంతంవల్ల ప్రయోజనం?...తనకు ఓ ఆడది—లోకానికి ఎందుకూ కొరకాని ఆడది!... అంతా తీరిపోయింది. అర్ధరాత్రి మంచులో తడుస్తూ వుండిపోయాడు.

తరువాత జీవితం ఎలా గడుస్తోందో తనకే తెలియదు. నెమ్మదిగా బి.ఏ., ఆతరువాత ఎం.ఏ. లిటరేచర్ చదివాడు. కాలేజీలో లెక్చరరయ్యాడు.

*　　*　　*

ఫ్లాస్కులో కాఫీపోసుకు తాగాడు. అప్పుడప్పుడూ తనకూడా వివాహంమీద మనసు పోతోంది. జీవితంలో మైలురాయిదగ్గర కూలబడిన తరువాత మావయ్య వచ్చి తన కూతుర్ని

చేసుకోమని బలవంతపెట్టాడు. కమల అణువులుగా చీలిపోయి చుట్టూ నిలబడి నవ్వింది. ససేమిరా వల్ల కాదన్నాడు.

రవణ కమల పెళ్ళికి ఆఖరిక్షణంలో బయలు దేరాడు. పచ్చ తోరణాలు గలగలమంటున్నాయి. సన్నాయిపాట గుండెలో భయాన్ని రేకెత్తించింది. రవణ కమల్ని పరీక్షగా చూశాడు. ముఖానిండా వెన్నెలఅలుముకున్నట్టుంది. కళ్లల్లో ఉత్కృష్టజీవితం కనిపించింది. పక్కనే రాసుకుంటూకూర్చున్న పెళ్ళి కొడుకును చూస్తే తీరని అసూయ కలిగింది. షేక్స్పియర్ "అదొక ఆకుపచ్చ కళ్ళ రాక్షసి" అని హెచ్చరించాడు. ఓ వెండికంచం చదివించి వచ్చేశాడు.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. కమల ఓ పక్కా—జీవితపు సోపానాలొకపక్కా—ఆలోచనల్ని కబళిస్తున్నాయి. తన జీవితం ఎందుకు వృధాకావాలి? మనిషిమీద మనిషికి చనిపోయాకకూడా ఎందుకు మమకారం? ఒమర్ ఖయ్యాం పాట సన్నగా—దూరంగా వినిపించింది. తను మామయ్య కూతుర్ని చేసుకుంటే?...సీత అందమైంది. అడకువ వున్నది. రక్తసంబంధాన్ని పురస్కరించుకుని తనే చిన్నసాయమైనా చెయ్యాలి. సీత మామయ్యకి గాడిద బరువు. తనజీవితపు అంధకారాన్ని చూసి మామయ్య జాలిపడటం లేదు. కేవలం అతవి స్వార్థంకోసం—ఇంతవరకూ అందుకు దూరంగా వున్నాడు. పక్కయింట్లో ఆలుమగలు పకపక నవ్వుకుంటున్నారు. చీకట్లో జంటలు తిరిగి వస్తున్నారు. అన్నీ కలిసి ఆకర్షణ పత్రాల్లా ఆకర్షిస్తున్నాయి. తన సెన్సిటివ్ బాలన్స్ చెడిపోతోంది.

* * *

ఉదయం ఏడుగంటలు—

ఆవేళ చెప్పాల్సినపాఠం చూసుకుంటున్నాడు. షెల్లీపద్యం 'టు ది మూన్' చదువుతుంటే కమలే కనిపించింది. సీత తెరలోంచి తొంగిచూచినవ్వింది.

"అమ్మయ్య..."

ట్రంకుపెట్టె నేలమీద దభీమని వుంచాడు.

"రా...మామయ్యా..నీకోసమే చూస్తున్నా."

"ఆ...అన్నీ పట్టికబుర్లు! అదంతా మీ అమ్మతో పోయింది. ఎప్పుడైనా వుత్తరాలకైనా జవాబిచ్చావు కనకనా-ఆఖరుకు నేనే నీ కాళ్ళదగ్గరకు రావలసి వచ్చింది...ఏమైనా పూర్తిగా మారి పోయావురా..."

రవణ నవ్వి వూరుకున్నాడు.

"ఇక్కడ కెందుకొచ్చానో తెలుసా?"

"మూడొంతులు కోర్టుపనిమీద..."

"అలాగే అనుకుంటావు—అసలు నిన్ను చూసి పోదామని వచ్చాను." రవణ ఆ మాట నమ్మలేదు. అరగంటసేపు బాతాఖానీ అయిన తరువాత అసలు విషయం బయట పెట్టాడు. సీత వివాహప్రసక్తి తెచ్చి కన్నీటి పర్యంతరం మాట్లాడి ఓ వెయ్యి రూపాయలకు తక్కువకాకుండా సాయం చేయమన్నాడు.

"నువ్వేమీ అనుకోకుండావుంటే నేనొక మాటంటాను."

"ఏమిటది?"

రవణకొంచెం తటపటాయించాడు. చివరకు చెప్పేశాడు. 'నిజంగా!...నేను నమ్మలేనుసుమా! నీ బుద్ధిప్పుడు దారిలోకి వచ్చిందిరా...' స్నానం ముగించి కాఫీతాగి వెళ్ళిపోయాడు కోర్టుపని మీద. రవణ ఆవేళ కాలేజీకి సెలవుకాగితం పంపాడు. అన్ని ఏర్పాట్లూ చేసుకోటానికి మామయ్య ఆవేళే ప్రయాణం కట్టాడు.

'ఇప్పుడు నిజంగా మనకుటుంబాలు కలిశాయి.'

రవణ సమాధానం చెప్పకుండా నోట్లకట్ట అందించాడు. అతను తెల్లబోతూ 'ఏమిటిది?' అన్నాడు.

"నువ్వడిగావుగా!...సీత పెళ్ళికి సాయంచేయమని."

"మరి ప్రొద్దుట్నుంచి నువ్వన్నమాటలు?"

"అదంతా వూరికే తమాషాకి...నలభయ్యో పడిలో పడ్డాక నాకు పెళ్లేమిటి? వెళ్ళు...ఇంకేం మాట్లాడొద్దు."

టాంకికోటులో వున్న మామయ్య మాసిపోయి తుప్పట్టుతున్న ట్రంకుతో—దూరంగా—అణువులా అయిపోతుంటే—కిటికీలోంచి చూస్తున్న రవణ కళ్ళలో నిండే నీటిచుక్కలు అప్పుడే వెలిగిన ఎలక్ట్రిక్ దీపాల్లో తళుక్కు మన్నాయి. కమల ఫోటోలోంచి విషాదంగా-సామ్రాజ్యాలుకోల్పోయి కూడా-ఠీవి తగ్గని రాణిలా నవ్వింది. ఈజీ చైరులో జేరపడి కళ్ళుమూసుకొన్నాడు రవణ. ★